# కథలు

సాధారణంగా మీరు పేపర్లలో చదువుతూంటారు 'భార్యను కడతేర్చిన భర్త' వంటి న్యూస్ ఐటమ్స్.

కొన్నిరోజుల తర్వాత అదే న్యూస్, క్రైమ్ కథ రూపంలో...

ఆ భర్త, ప్రాణాధికంగా ప్రేమించిన భార్యను ఎందుకు చంపాల్సి వచ్చిందో, ఆమె వేరెవరితోనో ఎలా తిరిగేదో కథలల్లి రాస్తారు. ఆ భార్య శరీర వర్ణన, నరాల ఆకలి, ప్రియుడితో సల్లాపాలాడిన విధం, సుఖించిన విధం అన్నీ ఆ జర్నలిస్టు కళ్లతో చూసినట్టు, ఆ భార్యభూతం వచ్చి దగ్గరుండి రాయించినట్టు రాసిపారేస్తాడు. పాఠకులకు క్రైమ్ కథ చదివినట్లు బుర్ర వేడెక్కుతుంది; సెక్స్ కథ చదివినట్లు ఒళ్లూ వేడెక్కుతుంది.

కానీ నా కథ చదివితే అవేమీ కలగవని ముందే చెబుతున్నాను. ఎందుకంటే నేను బతికే ఉన్నాను. నా భర్త నన్ను చంపడానికి ప్రయత్నించాడు కానీ పాపం, చంపలేకపోయాడు. ఎందుకైనా మంచిదని కోర్టులో నేను తిరుగుబోతుననీ, నేనే ఆత్మహత్యకు ప్రయత్నించాననీ వాదించాడు. ఆయన మేజిస్ట్రేటు కదా, చాలా చక్కగా వాదించగలడు. ఆయన తీర్పు చెప్పే సందర్భాల్లో కూడా ఇరుపక్షాల న్యాయవాదులకీ చక్కగా నచ్చచెప్పగలిగేవాడు. అందువల్ల ముద్దాయిగా నిలబడినప్పుడు కూడా ఆ వాదనాపటిమతో కోర్టువారిని నమ్మించగలిగేవాడు. కానీ చిన్న ప్రాబ్లెమ్ వచ్చిందాయనకు. అదే, నేను బతికే ఉన్నాను. నా కథ నేనే చెప్పుకునేందుకు.

నా భర్త మేజిస్ట్రేట్ అని చెప్పాను కదూ. చాలా తెలివైనవాడు. నేనూ ఉద్యోగం చేస్తున్నా, నన్నో తెలివితక్కువ దద్దమ్మలా చూసేవాడు. నేనూ దానికి అలవాటు పడిపోయాను. పెళ్లి అయిన పదేళ్ల తర్వాత ఓ 17 ఏళ్ల అమ్మాయితో ప్రేమలో పడ్డాడు. ఆ విషయంలో నన్నో, ఆ అమ్మాయినో తేల్చుకోమని నేను గట్టిగా చెప్పేసరికి ఆమెను వదులుకున్నాడు. ఆ తర్వాత ఇంకో వ్యవహారం. అదీ చాలాకాలం సాగలేదు. కానీ మూడో అమ్మాయితో మాత్రం తలమునకలుగా ప్రేమలో పడ్డాడులా ఉంది. నన్నూ, ముగ్గురు పిల్లల్నీ వదిలిపెట్టి వెళ్లిపోయాడు. ఇక నాకు ఒళ్లుమండి, విడాకులకు దరఖాస్తు పడేశాను.

విడాకుల విషయం తేలేలోపలే ఓ ఏడాది తర్వాత తిరిగివచ్చేశాడు నా దగ్గరికి. నేను రానిద్దామనుకోలేదు. ఇంటికి తాళం వేసి వెళ్లిపోయేదాన్ని. కానీ తాళం బద్దలుకొట్టి లోపలికి వచ్చేసేవాడు. పోలీసు కంప్లయింట్ ఇద్దామన్నా ఇల్లు మా ఇద్దరి పేరా ఉందాయె. చివరికి పిల్లలకోసం నేను ఒడంబడవలసి వచ్చింది. పాతికేళ్ల సంసారమాయె. బంధం తెంపుకోవాలన్నా మాటలా?

కానీ వచ్చిన దగ్గర్నుంచీ కుయుక్తులు మొదలెట్టాడు. మేజిస్ట్రేటు కదా, కథ ఎలా నడిపితే కోర్టువాళ్లు నమ్ముతారో అతనికి కొట్టిన పిండి. పిల్లలకు నా మీద చెప్పి పెట్టేవాడు. ఉత్తిపుణ్యానికి గొడవ చేసేవాడు. నేను సహించలేక గట్టిగా అరిస్తే, చూడు, మీ అమ్మ ఎలా ప్రవర్తిస్తోందో అనేవాడు. ఓసారి ఇంట్లో గిన్నెలన్నీ ఇష్టం వచ్చినట్టు పారేసి, ఫొటో తీసి తనతో పనిచేసే వాళ్లందరికీ చూపించాడు. నేనే గొడవ చేసి అవన్నీ అలా విసిరికొట్టేనని చూపించాలని ప్రయత్నం కాబోలు. ఓ ప్రైవేట్ డిటెక్టివ్‌ని పెట్టి, నా ఫోన్లు టాప్ చేయించి, నాకు ఇతరులతో సంబంధం ఉందని నిరూపించడానికి ప్రయత్నించాడు.



ఎమ్బీయస్ ప్రసాద్

నాకే సంబంధాలు లేవు కాబట్టి ఏమీ కనిపెట్టలేకపోయాడు పాపం.

అప్పట్లోనే మా అమ్మాయి పెంపుడు పిల్లి కనబడకుండా పోయింది. అప్పుడు తెలియలేదు కానీ దానికి చాలా ప్రాముఖ్యం ఉంది.

నా భర్త తొలిసారిగా నామీద చేసిన హత్యాప్రయత్నం విషప్రయోగం. ఓరోజు డ్రింక్ బాటిల్ పట్టుకొచ్చి నాకిచ్చాడు. తనంతట తనే కిచెన్‌లోకి వెళ్లి డ్రింక్ ఓ గ్లాసులో పోసి తీసుకొచ్చాడు. డ్రింక్ కలిపేటప్పుడు మా అమ్మాయి అనుకోకుండా కిచెన్‌వైపు వెళ్తే తిట్టిపోశాడు. డ్రింక్ రుచి నచ్చక నేను సగంకంటే తాగలేకపోయాను. మీరు తాగుతారా పోనీ అంటే వద్దన్నాడు. ఎప్పుడూ లేనిది తనే వెళ్లి గ్లాసు కడిగాడు. పిల్లలు కూడా అది గమనించి కామెంట్ చేశారు. కానీ మాకేం తెలుసు, దాంట్లో స్లో పాయిజన్ కలుపుతున్నాడని! దెబ్బకి రెండు మూడు వారాలపాటు నేను జబ్బు పడిపోయాను. కళ్లు తిరిగుతున్నట్టుగా ఉండేది. అస్తమానూ తూలిపోతుండేదాన్ని.

ఇదిలా ఉండగానే, రెండో ప్రయత్నం జరిగింది. ఆ రోజు నేను మంచి హుషారులో ఉన్నాను. అనుకోకుండా లాటరీ ఒకటి తగలడంతో. కారు గరాజ్‌లో పెడదామంటే మా ఆయన అది అలా బయటే వదిలేయ్, నాది అడ్డుగా ఉంది. రెండూ కలిపి నేనే పెడతాలే! అన్నాడు. ఈయనకింత సద్బుద్ధి ఎప్పుడొచ్చిందిరా అనుకుంటూ కారు తాళాలు ఆయనకిచ్చి వచ్చేశా. ఆ తర్వాత ఆయన ఎక్కడకెళ్లాడో గానీ చాలా లేటుగా వచ్చాడు. డ్రింక్ తీసుకోమన్నాడు. నాకు బాగా నిద్రపట్టేటట్టు చేయడానికి కాబోలు.

ఓ రాత్రివేళ పెద్ద చప్పుడు వినబడి మెలకువ వచ్చేసింది. గీజర్ ఓవర్ హీటెక్కిపోయిందా అనుకున్నాను. చీకట్లో లేచి చూద్దును కదా, బెడ్‌రూమ్ లైటు మరీ డిమ్ అయి ఉంది. మా ఆయన మంచం కోడు దగ్గర కనబడ్డాడు. నన్ను చూసి లేచి నించున్నాడు కానీ, ఏమీ మాట్లాడలేదు. నేలమీద ఒక ప్లైవుడ్ బాక్స్, కుట్టుమిషనంత సైజుది ఉంది. దాన్లోంచి ఒక ట్యూబ్, గోడ కన్నంలోంచి బయటకు వెళ్తోంది. ఈ కన్నం ఏమిటి, ఈ గొట్టం ఏమిటి అని నేను ఆశ్చర్యపడుతూండగానే ఆయన నిశ్శబ్దంగా అవన్నీ సర్దేస్తున్నాడు. అంతలోనే నాకు హఠాత్తుగా తట్టింది నన్ను చంపడానికి మా ఆయన ఏదో ప్రయత్నం చేసి ఉండాలని. అదేమిటో నాకు తెలియదు గానీ, భయంతో ఇంట్లోంచి బయటకు పారిపోయి వీధి చివరకు వెళ్లి పోలీసులను పిలిచాను. వాళ్లొచ్చేదాకా పక్కింటివాళ్ల గోడ వెనక్కి వెళ్లి నక్కాను.

నిజానికి మా ఆయన అద్భుతమైన ప్లాను వేశాడు. రోజూ క్రిమినల్ కేసులు ఎన్ని చూస్తాడో, చట్టానికి దొరక్కుండా ఎలా తప్పించుకోవాలో తెలియకుండా ఉంటుందా? మా అబ్బాయి, చిన్నమ్మాయి ఊళ్లో లేరు. ఇంటిపక్కవాళ్లు కూడా చాలామంది ఊరిలో లేరు. అందువల్ల సాక్షులు తక్కువమంది ఉంటారు కదా! నా డ్రింక్‌లో మత్తుమందు కలిపి నన్ను నిద్రబుచ్చేశాడు. ఆ పెట్టె నా ముఖంమీద పెట్టేసి గాలి చొరకుండా చేశాడు. తర్వాత గరాజ్ బయట ఉన్న కారు ఎగ్జాస్ట్ పైపులోంచి వచ్చే కార్బన్ మొనాక్సైడ్, ట్యూబ్ ద్వారా వచ్చి నేను ఉక్కిరిబిక్కిరై చావాలి. కానీ చావలేదు.

చచ్చిపోయి ఉంటే అది ఆత్మహత్య అని నిరూపిద్దామని తక్కిన ఏర్పాట్లు కూడా చేశాడు. కారులో డ్రైవింగ్ సీటు పడుకున్నట్టు అడ్జస్ట్ చేశాడు. కారు నేను బయటే వదిలేసేట్టు చేశాడు. ఇవన్నీ చాలనట్టు ఒక ఉత్తరం ఒకటి సృష్టించాడు. అది తను నాకు రాసినట్టుంది. నన్నాయన విడిచిపెట్టేసినట్లు, పిల్లల్ని కూడా తనే ఉంచుకుని ఇంట్లోంచి నన్ను గెంటేస్తున్నట్టు, అందువల్ల తక్షణం నేను ఇల్లు విడిచిపోవాలని రాసి ఉంది దానిలో. అంటే బాధ భరించలేక నేను ఆత్మహత్యకు తలపడ్డానన్నమాట! ఇంత బ్రహ్మాండమైన ప్లాను మేమెక్కడా చూడలేదన్నారు పోలీసులు. బాక్స్ దొరకలేదు కానీ, బెడ్‌రూమ్‌లో చిన్న ముక్క దొరికింది.



పాత విషయాలన్నీ విన్నాక వాళ్లకు అనుమానం వచ్చి, కోర్టులో మా అమ్మాయి పెంపుడు పిల్లి చెత్తకుండీలో దొరికిందన్నారు. ఈయన రియాక్షన్ ఎలా ఉంటుందో చూద్దామని. ఆ పిల్లి ఎలా చచ్చిపోయిందో నాకు తెలుసు అన్నారీయన చటుక్కున. తను కారు బాగుచేసుకుంటూండగా పిల్లి వచ్చి గరాజ్‌లో తన పెట్టెలో ఎక్కిందట. ఈయన కారు ఇంజన్ ఆన్ చేసి టీ తాగడానికి బయటకెళ్లారట. ఆ బాక్స్‌లో ఇరుక్కుపోయిన పిల్లి ఇంజన్ పొగలకు ఉక్కిరిబిక్కిరై చచ్చిపోయిందట. అసలా బాక్స్‌లో పిల్లి ఎలా ఇరుక్కుపోయిందట?

దాంతో అందరికీ తెలిసిపోయింది పాయిజన్ బాక్స్ ఎలా పనిచేస్తుందో చూడాలనే పిల్లిమీద మొదటి ప్రయోగం జరిగిందని, అది విజయవంతం కావడంతో నామీద అదే పద్ధతిలో ప్రయత్నం జరిగిందనీ. ఆయన వాదనలు చెల్లలేదింక. కోర్టు తొమ్మిదేళ్ళ శిక్ష వేసింది మా ఆయనకు. ఆ శిక్ష చాలంటారా? ■